క్లుప్తంగా

వ్యాపారాభివృద్ధికి జీనీ యాప్ దోహదం



ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులను విడుదల చేయిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: వ్యాపారాభివృద్ధికి వావ్ జీనీ యాప్ ఉత్తమ ఈ కామర్స్ ప్లాట్‌ఫాం అని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన జీనీయాప్ ద్వారా విక్రయానికి సిద్ధం చేసిన వివిధ రకాల ఉత్పత్తులను మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా ప్రారంభించారు. మెప్మా టీపీఆర్‌ఓ సుబ్బరాయుడు, టీఎంసీ నారాయణరెడ్డి మాట్లాడారు. రాయదుర్గంలోని ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడి నుంచి మెప్మా కార్యాలయానికి పంపుతామన్నారు.

పాలిసెట్ షెడ్యూల్ విడుదల

ఉరవకొండ: పాలిసెట్ 2025 షెడ్యూల్ విడుదల అయినట్లు చిన్నముష్టూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆష్రాఫ్‌అలీ శనివారం తెలిపారు. ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 15వ తేది వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. 30న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల్లో రూ.400 బీసీ, ఓసీ విద్యార్థులు, రూ.100 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రుసుం చెల్లించాలని తెలిపారు.

పేడదిబ్బలు వేస్తే చర్యలు

కూడేరు: ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పేడ దిబ్బలు వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఏఎస్‌ఐ రామానాయుడు హెచ్చరించారు. స్థానిక ఎమ్మార్సీ గేటు ముందు అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన కొందరు పేడ దిబ్బలు వేయడంతో ఎంపీడీఓ, ఈఓఆర్డీ రాధాకృష్ణ శనివారం నోటీసులు ఇచ్చి వాటిని తొలగింపజేశారు. సర్పంచ్ లలితమ్మ, కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రాయదుర్గంటౌన్: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమపై కపట ప్రేమ చూపుతోందన్నారు. మరోవైపు విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు కార్మికులకు చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సీపీఐ నాయకులు తిప్పేస్వామి, దుర్గన్న, తేజ, రామాంజనేయులు పాల్గొన్నారు.

సామూహిక ఇఫ్తార్‌తో ఐక్యత



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులోని మక్కా మసీదులో శనివారం సాయంత్రం సామూహిక ఇఫ్తార్ విందు జరిగింది. కాలనీకి చెందిన కొందరు ముస్లిం యువకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించి మగ్‌రిబ్ నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఇఫ్తార్ కార్యక్రమంతో పుణ్యఫలంతోపాటు ఐక్యతకు దోహదపడుతుందని మసీదు ఇమామ్ ముఫ్తీ నూర్ మహమ్మద్ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం

గుమ్మఘట్ట: మండలంలోని మారెంపల్లిలో రైతు గోనబావి కృష్ణయ్య రెండెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నిప్పంటించారు. దీంతో పంట పూర్తిగా కాలిపోయింది. రూ.60వేలు నష్టపోయినట్లు బాధిత రైతు కృష్ణయ్య తెలిపాడు. పంట చేతికి వచ్చే సమయంలో నిప్పంటించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

అందరి సహకారంతో సారా నిర్మూలన



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కంబదూరు: గ్రామాల్లో నాటుసారాను అరికట్టాలంటే ప్రజలందరి సహకారం అవసరమని ఎక్సైజ్ సూపరింటెండెంట్లు శ్రీరామ్, రేవతి అన్నారు. శనివారం మండలంలోని కుర్లపల్లి గ్రామంలో నవోదయం–2 కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలన కోసం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాలు, నష్టాలను గ్రామస్తులకు తెలియజేశారు. అనంతరం కళాజాతా బృందం వారు నాటికలు, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులతో కలిసి నాటుసారా రహిత గ్రామంగా తయారు చేసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐ సునీల్‌కుమార్, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

విజయోస్తు!



సాధారణంగా పరీక్షలంటేనే విద్యార్థుల్లో భయం ఉండడం సహజం. ఒత్తిడిని అధిగమించాలి.. ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఆత్మవిశ్వాసంతో పరీక్ష కేంద్రాలకు వెళ్లాలని, అప్పుడే అంతా విజయమేనని మేధావులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచిస్తున్నారు. ఈనెల 17 నుంచి జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం/ఉరవకొండ:

ఒత్తిడిని అధిగమిస్తే విజయమే
- రేపటి నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్, రూరల్‌తో పాటు గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని 82 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 4,528 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు సిద్ధమవుతున్నారు. వీరి కోసం మొత్తం 21 కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాయదుర్గంలో 7, డి.హీరేహాళ్‌లో 3, గుమ్మఘట్టలో 3, కణేకల్లులో 4, బొమ్మనహాళ్‌లో 4 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శనివారం పట్టణంలోని పరీక్షా కేంద్రాలను ఎంఈఓ నాగమణి పర్యవేక్షించి, సౌకర్యాలను పరిశీలించారు.

ఉరవకొండ నియోజకవర్గంలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 3,629 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో సమస్యాత్మక కేంద్రాలు 8 ఉన్నాయి. పరీక్షల కోసం 86 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇందులో ఉరవకొండలో ఐదు పరీక్షా కేంద్రాల్లో 1530 మంది, బెళుగుప్పలో 2 పరీక్షా కేంద్రాల్లో 440 మంది, కూడేరులోని 2 పరీక్షా కేంద్రాల్లో 299, వజ్రకరూరు మండలంలో 3 పరీక్షా కేంద్రాల్లో 680 మంది, విడపనకల్లు మండలంలో 4 పరీక్షా కేంద్రాల్లో 680 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా పదోతరగతి పబ్లిక్ పరీక్షల కోసం 13 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో మొత్తం 3052 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి



పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రతా ఏర్పాట్లు కూడా పకడ్బందీగా ఉంటాయి. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష రోజు ఉదయం 8.30 గంటలకు కచ్చితంగా కేంద్రం వద్ద ఉండేలా చూసుకోవాలి. ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా ప్రవేశం ఉండదు. 9.30 గంటల నుంచి 12.45 వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

– నాగమణి, ఎంఈఓ, రాయదుర్గం

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి



పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా, ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి. ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయి. రాత్రి కనీసం 7 నుంచి 8 గంటల పాటు నిద్రపోవాలి. ఇంట్లోనే లభించే పౌష్టికాహారం తీసుకోవాలి. బయట లభించి ఫాస్ట్‌ఫుడ్ జోలికి వెళ్లరాదు.

– రామేశ్వర్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు, డాక్టర్ రాధాకృష్ణమున్సిపల్ హైస్కూల్, రాయదుర్గం

మంచి మార్కులు సాధిస్తాం



తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో బాగా చదువుకున్నాం. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక ప్రణాళికతో ఉపాధ్యాయులు చదవించారు. స్టడీ అవర్స్‌తో సబ్జెక్టుల వారీగా నిర్వహించిన పరీక్షలు, గ్రాండ్ టెస్టులు ఉపయోపడుతాయి.

– రాధిక, టెన్త్ క్లాస్, బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్, రాయదుర్గం

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కూడేరు పీహెచ్‌సీ ఆవరణలో చీపురుతో చెత్తను తొలగిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి



కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న పోలీసులు

- డీఎం హెచ్‌ఓ భ్రమరాంబదేవి

కూడేరు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి తెలిపారు. శనివారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర–ఆరోగ్యాంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా వైద్యాధికారి భ్రమరాంబదేవి పాల్గొని చీపురు పట్టి సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న చెత్తను ఊడ్చారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత, నివాస పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పీహెచ్‌సీ ఆవరణలో చెట్టు పెంచి పచ్చదనాన్ని పెంపొందింపజేయాలని సిబ్బందికి ఆదేశించారు. డాక్టర్ సౌమ్యా రెడ్డి, సూపర్ వైజర్లు రవీంద్ర, యశోద, ఎల్‌టీ వేణుగోపాల్, ఫార్మసిస్టు వేణుగోపాల్, ఏఎన్ ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రత మనందరి బాధ్యత

రాయదుర్గంటౌన్: శుభ్రత మనందరి బాధ్యతగా గుర్తించి పట్టణాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద కార్యక్రమాన్ని చేపట్టారు. తడి, పొడి, హానికరమైన చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, జ్యోతి, ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, భీమనపల్లి దివాకర్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రూరల్ ఎస్‌ఐ రామాంజనేయులు, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జయరాం రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని రూరల్ స్టేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రం చేశారు.

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఉద్దేహాళ్, నేమకల్లు గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర మిషన్–స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించి,మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, ఈఓపీఆర్‌డీ దాస్, పంచాయతీ కార్యదర్శి శివన్న తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ మల్లికార్జున

వజ్రకరూరు: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈఓ తిమ్మప్ప సూచించారు. శనివారం మండలంలోని రాగులపాడు గ్రామంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. అనంతరం సబ్జెక్టు టీచర్లతో ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, అన్నిసబ్జెక్టుల్లోనూ వందమార్కులు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం ఎంఈఓ తిమ్మప్ప మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాల్యానాయక్, ఉపాధ్యాయులు, టెన్త్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

బొమ్మనహాళ్: ఈనెల 17 నుంచి ప్రారంభయ్యే పదోతరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నారు. 18 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 888 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మండలంలో 4 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. ఒక్కో కేంద్రంలో చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారితో పాటు ఇన్విజిలేటర్లు ఉంటారు.

పది పరీక్షలకు ఐదు కేంద్రాలు ఏర్పాటు

ఉరవకొండ: ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు కేంద్రాల్లో 1,530 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలకు మొత్తం 59 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు



ఉరవకొండలో షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు



కూడేరులో విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేసిన ఎంపీడీఓ కుళ్లాయిస్వామి

ఉరవకొండ: ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని ఎంపీడీఓ రవిచంద్ర, మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు దుకాణాల్లో ఎంపీడీఓ, ఈఓ, పంచాయతీ సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈఓ గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ 40 మైక్రాన్ ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని చెప్పినా వాడటంపై వ్యాపారులపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా ప్లాసిక్ కవర్లు వాడటం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. అనంతరం పట్టణంలో వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కవర్లు నిషేధంపై అవగాహన ర్యాలీ చేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

వజ్రకరూరు: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచు మోనాలిసా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మంజునాథ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మెయిన్ బజార్‌లో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు మల్లయ్య, అనిల్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు సుశీలమ్మ, నాగశంకర్, మండల కోఆర్డినేటర్ శివశంకర్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరం

కూడేరు: ప్లాస్టిక్‌తో తయారు చేసిన కవర్లు, ఇతర వాటిని వాడడం ద్వారా మానవుని ఆరోగ్యం పై ప్రభావం చూపి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. శనివారం అధికారులు కూడేరు హైస్కూల్ విద్యార్థులతో కలిసి 'ప్లాస్టిక్ వాడకం' తో కలిగే నష్టాలపై గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. బస్టాండులో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఈఓఆర్డీ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు

శెట్టూరు: పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని, పార్టీ బలోపేతానికి కలసికట్టుగా పనిచేద్దామని మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ మండల కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. పార్టీకి వెన్నంటి ఉన్న ప్రతి నాయకుడిని, కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్నారు. పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమానికి 16 గ్రామ పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, నియోజవర్గం బూత్ కన్వీనర్ తిప్పేస్వామి, బీసీ సెల్ అధ్యక్షులు విజయ్‌కుమార్, జిల్లా అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షులు సంధ్యారాణి, నియోజకవర్గం సాంస్కృతిక అధ్యక్షుడు గిరిప్రసాద్, నాయకులు హరినాథ రెడ్డి, సర్పంచులు సత్యనారాయణ రెడ్డి, గొర్ల గంగాధర్, నాగరాజు, ప్రకాష్, వెంకటేశులు, ఎంపీటీసీలు నరసింహులు, ప్రహ్లాద, నాయకులు మిద్దె సుధాకర్, టైలర్ వన్నూరుస్వామి, అనంతరెడ్డి, లింగప్ప, బొచ్చేహళ్లి రాజశేఖర్, లక్ష్మణమూర్తి, సోమశేఖర్, మాదయ్య, చటాకుల రామాంజనేయులు, ప్రతాప్, ఈరన్న, శ్రీరాములు, నాగేంద్ర పాల్గొన్నారు.

సీతారామస్వామికి ప్రత్యేక పూజలు



వజ్రకరూరులో అలంకరణలో జనార్దన వేంకటేశ్వర స్వామి

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలోని సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు ,విశేషపూజలు, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వజ్రకరూరులోని జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోరంబోకు భూముల్లో సాగు చేస్తే చర్యలు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రం గ్రామానికి తాగునీటి సరఫరా అయ్యే ట్యాంకు చుట్టూ పోరంబోకు భూముల్లో సాగు చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మునివేలు హెచ్చరించారు. గ్రామ శివారులోని గ్రామానికి తాగునీటి సౌకర్యం కోసం బోర్లు వేసి ట్యాంకును ఏర్పాటు చేశారు. ట్యాంకు చుట్టూ వ్యవసాయం సాగు చేసి పంటలను క్రిమి సంహారక రసాయనిక మందులు వాడతుండడం వల్ల ట్యాంకులకు చేరి వ్యాధులు సంభవిస్తున్నాయని సర్పంచ్ తిప్పేస్వామి, గ్రామ ప్రజలు తహసీల్దార్ మునివేలకు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ మునివేలు శనివారం పరిశీలించి బోర్డును ఏర్పాటు చేశారు. 271–ఎ సర్వే నంబర్‌లో పోరంబోకు భూముల్లో సాగు చేసే చర్యలు తీసుకుంటామని బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో నాగరాజు, తిప్పేస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేకం



బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి, సంతోష్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి



అజయ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఉమా,తిప్పేస్వామి

కంబదూరు: ప్రమాదశావత్తూ వరి మడిలో జారీ పడి మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అజయ్ కుమార్‌కు నాయకులు నివాళులర్పించారు. శనివారం మండల కేంద్రంలోని అజయ్ కుమార్ మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి సందర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, వడ్డే వెంకటప్ప, యువజన నాయకుడు బీమేష్ ,జిల్లా నాయకలు సాకే గంగాధర్, నీలి శంకరప్ప, తలారి సత్తి, బొమ్మయ్య, నాయకులు అందేపల్లి రామాంజనేయులు, మల్లూరి వెంకటేశులు, మల్లేష్, ఫయాజ్, దాదు, రామస్వామి, జెల్లిపల్లి అనిల్,అచ్చంపల్లి నాగరాజు, హనుమంతరాయుడు, చెన్నకేశవులు, కిరణ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యం



స్కూటర్ యాత్రలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉరవకొండ: ఉపాధి హామీ పనులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ధ్వజమెత్తారు. ఉపాధి పనులు కల్పించి కూలీలను ఆదుకోవాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద స్కూటర్‌యాత్రను ప్రారంభించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉరవకొండ మండలంలో నాలుగు గ్రామాల్లో 160 మందికి మాత్రమే పనులు కల్పించారని, మిగిలిన 23 గ్రామాల్లో ఒక్క పనీ చేపట్టలేదన్నారు. విడపనకల్లు మండలంలో రెండు గ్రామాల్లో 35 మందికి, వజ్రకరూరు మండలంలోని రెండు గ్రామాల్లో 45 మందికి మాత్రమే కల్పించారన్నారు. ఉరవకొండ ఏపీఓ మధ్యాహ్నం 12 గంటలైనా విధులకు హాజరు కావడం లేదన్నా రు. 30 శాతం మందికి కూడా 100 రోజుల పని దినాలు పూర్తి కాలేదన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నా , ఏప్రిల్ మొదటి వారంలో కలెక్టరెట్ ముట్టడి ఉంటుందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, పెద్దముస్టూరు వెంకటేష్, మండల నాయకులు మురళి, రవి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో 13 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం చేసినట్లు కూటమి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు. స్థానిక ప్రజా వేదికలో శనివారం బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 13 మంది బాధితులకు దాదాపు రూ.18.64 లక్షలు అందించారు.

మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా షేక్ అఫ్జల్

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా షేక్ అఫ్జల్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఓ ప్రకటన విడుదలైంది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, కళ్యాణదుర్గం పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్యకు అఫ్జల్ కృతజ్ఞతలు తెలియజేశారు.

వన్ టైం సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కూడేరు: వన్‌టైం సెటిల్‌మెంట్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీబీ మేనేజర్ రవికుమార్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడారు. బ్యాంక్ పరిధిలో 45 మంది రైతులు మొండి బకాయిదారులు ఉన్నారన్నారు. ఈ అవకాశం ఈ నెల 29 వరకే ఉందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9490158233కి సంప్రదించాలన్నారు.

కాన్షీరాం జయంతి

రాయదుర్గంటౌన్: స్థానిక ఎపీఎన్జీవో భవనంలో బీఎస్పీ ఆధ్వర్యంలో కాన్షీరాం 91వ జయంతి వేడుకలను శనివారం జరిపారు. టీ.వీరాపురం, 74 ఉడేగోళం, కాశీపురం, శిరిగేదొడ్డికి చెందిన దాదాపు 43 మంది బీఎస్పీలో చేరినట్లు తెలిపారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు మాట్లాడారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌తో ప్రజలకు జరిగిన మేలేమీ లేదన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో వచ్చిన అర్జీలకే అతీగతీ లేదన్నారు.

కుందుర్పిలో శానిటరీ ప్యాడ్స్ తయారీ కేంద్రం

కుందుర్పి: మండలంలోని నిరుద్యోగ మహిళలకు జీవనోపాధి కల్పించడంతో భాగంగా నూతనంగా శానిటరీ ప్యాడ్స్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కుసుమగిరి రైతు సంఘం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వ్యవస్థాపకుడు నరసింహమూర్తి తెలిపారు. శనివారం బెంగళూరు నుంచి 10 మిషన్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో శానిటరీ ప్యాడ్స్ తయారీ కేంద్రం ప్రారంభించి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. కళ్యాణదుర్గం డివిజన్ వ్యాప్తంగా 21 గ్రామాల్లో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి 75 శాతం సబ్సిడీతో 269 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించినట్లు తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణం సమీపంలోని అత్యంత ప్రసిద్ది చెందిన అక్కమాంబ ఆలయం హుండీ కానుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ 1,00,040 వచ్చిందని ఆలయా చైర్మన్ రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కూడేరు: గొటుకూరుకు చెందిన రామ్మోహన్‌రెడ్డి శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అనంతపురానికి కారులో వెళ్తుండగా గొటుకూరు మలుపు వద్ద అదుపుతప్పి కారు రోడ్డుపక్కనే ఉన్న గోతిలో పడింది. దీంతో రామ్మోహన్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని అనంతపురం సర్వజనాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

బాలిక అదృశ్యం

బొమ్మనహాళ్: కుర్లపల్లికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన బాలిక జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. శనివారం ఉదయం ఇంటర్మీయెట్ చివరి పరీక్ష రాయడానికి ఇంటినుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితంలేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.